గోల్డ్ హై జంప్

ఒక్కరోజే రూ.2,430 ఎగిసిన తులం ధర

ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.88,500కు చేరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఆల్‌టైమ్ హైలో స్థిరపడ్డాయి. సోమవారం ఒక్కరోజే దేశీయ మార్కెట్‌లో దాదాపు రెండున్నర వేలు పుంజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. స్టాక్, ఫారెక్స్ మార్కెట్లతోపాటు బులియన్ మార్కెట్‌నూ షేక్ చేసేశాయి మరి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర రూ.2,430 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,500ను తాకింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

ఇదీ సంగతి..

అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేస్తామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలవగా.. బంగారం, వెండి తదితర కమోడిటీ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే స్పాట్ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ విలువ రికార్డు స్థాయిలో 2,900 డాలర్లు పలికింది. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ రూ.2,932.69 డాలర్లుగా ట్రేడైంది. త్వరలోనే 3,000 డాలర్లు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక సిల్వర్ ఔన్స్ 32.76 డాలర్లను చేరింది. ఈ ట్రెండ్ దెబ్బకు భారతీయ మార్కెట్లలోనూ హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపించింది. ఫలితంగా ఒక్కసారిగా రేట్లు పైపైకి పోయాయి. నిజానికి గతకొద్ది రోజులుగా గోల్డ్ మార్కెట్ దూకుడు మీదనే ఉన్నది. స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపే అడుగులు వేస్తున్నారు. అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలతో వాణిజ్య యుద్ధానికి అవకాశాలుండటంతో పుత్తడి ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే వీలే ఉన్నదంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. దీంతో మదుపరులు గోల్డ్‌పై ఇంకా ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టవచ్చని అంచనా వేస్తున్నా రు. అదే జరిగితే సరికొత్త శిఖరాలను ధర లు అధిరోహించడం ఖా యమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి ప్పుడు.

హైదరాబాద్‌లో..

దేశ రాజధానిలో ధరలతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో రేట్లు ఒకింత స్థిరంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.87,060గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పసిడి ధర రూ.79,800గా నమోదైంది. గతంతో పోల్చితే వరుసగా రూ.390, రూ.350 చొప్పున పెరిగాయి. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,500గా ఉన్నది. మునుపటితో చూస్తే రూ.1,000 పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్‌కుగాను 10 గ్రాములు రూ.940 పెరిగి రూ. 85,828గా నమోదైంది. జూన్‌కు రూ.1,015 ఎగిసి రూ.86,636గా ఉన్నది.

త్వరలో తులం లక్ష?

బంగారం ధరలు పెరుగుతున్న తీరును చూస్తే తులం లక్ష రూపాయలను తాకే సమయం ఎంతో దూరంలో లేదనిపిస్తున్నది. రేపటి రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయ విపణిలోనే 10 గ్రాములు లక్ష రూపాయల మార్కును తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తున్నారు మరి. అయితే గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్స్ 2,900 డాలర్ల మార్కును దాటడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నది. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

అపోలో లాభం రూ. 372 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది సంస్థ. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.245 కోట్ల లాభంతో పోలిస్తే 52 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు ఎగబాకింది. వచ్చే మూడు నుంచి నాలుగేండ్లకాలంలో కొత్తగా 11 ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగా 3,512 పడకలు జతకానున్నాయని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. ముంబై నుంచి వారణాసి, చెన్నై నుంచి గురుగ్రామ్ వరకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.9 లేదా 180 శాతం మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

PATANJALI
PATANJALI FOODS LIMITED

పతంజలి ఫుడ్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.370.93 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది పతంజలి ఫుడ్స్ లిమిటెడ్. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.216.54 కోట్ల లాభంతో పోలిస్తే 71.29 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.7,910.70 కోట్ల నుంచి రూ.9,103.13 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. నిర్వహణ ఖర్చులు కూడా రూ.8,652.53 కోట్లకు ఎగబాకాయి

రిలయన్స్ స్పోర్ట్స్ డ్రింక్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:రిలయన్స్ గ్రూపునకు చెందిన రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తాజాగా స్పోర్ట్స్ హైడ్రేషన్ డ్రింక్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ప్రముఖ శ్రీలంక క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌తో కలిసి స్పిన్నర్ పేరుతో ఈ డ్రింక్‌లను మార్కెట్లోకి విడుదల ఏసింది. ఇప్పటికే కంపా కొలా పేరుతో కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న సంస్థ తాజాగా విడుదల చేసిన 150 ఎంఎల్ సింగిల్-సర్వ్ బాటిల్ కలిగిన స్పోర్ట్స్ డ్రింక్ ధర రూ.10గా నిర్ణయించింది. ఇతర పోటీ సంస్థలైన పెప్సీకో, కోక-కోలాకు చెందిన స్పోర్ట్స్ డ్రింక్స్ కంటే తక్కువ ధరతో విడుదల చేయడం విశేషం.

టాటా బోయింగ్ 300వ ఫ్యూజ్‌లేజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10: టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ హైదరాబాద్ యూనిట్ నుంచి ఏహెచ్-64 అపాచీ అటాక్ హెలిక్యాప్టర్ కోసం మరో బాడీని డెలివరీ చేసింది. ఈ ఫ్యూజ్‌లెజ్ 300వది కావడం విశేషం. ఇక ఈ హెలిక్యాప్టర్లను అమెరికా ఆర్మీతోపాటు భారత ఆర్మీ కూడా వినియోగిస్తున్నది. దేశీయ ఎయిర్‌ఫోర్స్ 22 ఏహెచ్-64ఈ అపాచీ హెలిక్యాప్టర్లను కలిగివున్నది. బోయింగ్, టీఏఎస్‌ఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో 900 మంది ఇంజినీర్లు, టెక్నిషన్లు ఉన్నారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో తయారైన ఉత్పత్తులు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి.

ట్రంప్ టారీఫ్‌ల దెబ్బ

సెన్సెక్స్ 548, నిఫ్టీ 178 పాయింట్ల పతనం

ముంబై, ఫిబ్రవరి 10: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ భారీగా నష్టపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే అల్యూమినియం, స్టీల్‌పై 25 శాతం సుంకం విధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మార్కెట్లపై పిడుగుపడ్డట్టు అయింది. మదుపరుల్లో నమ్మకం సడలడంతో అమ్మకాల బటన్ నొక్కారు. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, మెటల్, చమురు రంగ షేర్లు కుదేలవడం సూచీల పతనానికి ఆజ్యంపోసింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 548 పాయింట్లు నష్టపోయి 77,311.80 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద స్థిరపడింది. అమెరికా టారిఫ్ భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని, దేశీయ మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టాప్ లూజర్‌గా పవర్‌గ్రిడ్

నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో పవర్‌గ్రిడ్ షేరు భారీగా పతనం చెందింది. ఒక దశలో నాలుగు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3.45 శాతం నష్టంతో రూ.268.70 వద్ద ముగిసింది. దీంతోపాటు టాటా స్టీల్, జొమాటో, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ షేర్లు కూడా రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. అలాగే మహీంద్రా, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, రిలయన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లే, ఎస్బీఐ షేర్లు పతనం చెందాయి. కానీ, కొటక్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 2.25 శాతం తగ్గగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.06 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 2.69 శాతం నష్టపోగా, మెటల్ 2.63 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 2.61 శాతం, యుటిలిటీ 2.49 శాతం దిగువకు పడిపోయాయి.

నష్టాలకు కారణాలు ఇవే

- అమెరికా దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం సుంకాల ప్రకటన
- దేశీయ మార్కెట్లో విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం
- రూపాయితో పోలిస్తే డాలర్ మరింత బలపడటం
- దేశీయ కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు

నాలుగు రోజుల్లో 7.68 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటంతో లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద కరిగిపోతున్నది. ఎఫ్ఐఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, కొత్తగా టారిఫ్ యుద్ధానికి ట్రంప్ తెరలేపడంతో గత నాలుగు సెషన్లలో మదుపరులు రూ.7.68 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో నమోదిత సంస్థల విలువ రూ.7,68,252.32 కోట్లు కరిగిపోయి రూ.4,17,82,573.79 కోట్లకు చేరింది.

88 దగ్గరదాకా..

ఆఖర్లో కోలుకున్న రూపాయి • 5 పైసలు పెరిగి 87.45 వద్ద ముగింపు



ముంబై, ఫిబ్రవరి 10: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఒకానొక దశలో 50 పైసలు క్షీణించి 88 దరిదాపుల్లోకి దిగజారింది. ఆల్‌టైమ్ ఇంట్రా-డే కనిష్ఠాన్ని తాకుతూ 87.95 స్థాయిని చేరింది. అయితే ఆఖర్లో కోలుకున్నది. ఈ క్రమంలోనే చివరకు 5 పైసలు లాభపడి 87.45 వద్ద ముగిసింది. శుక్రవారం 87.50 దగ్గర ఆగిన విషయం తెలిసిందే. కానీ అంతకుముందు రోజు గురువారం మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి పడిపోయి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో తాజా లాభాలతో వరుసగా రెండు రోజుల ట్రేడింగ్‌ల్లో 14 పైసలు లాభపడినట్టైంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేయడం డాలర్‌ను బలపర్చింది. అమెరికాపై పరస్పర సుంకాలతో బదులిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలకూ ట్రంప్ దిగుతున్నారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందేమోనన్న భయాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఈ అంచనాలు కూడా రూపీని బలహీనపరుస్తున్నాయన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

రిక్తమ్ ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10: హైదరాబాద్ ఆధారిత రిక్తమ్ గ్రూపు తాజాగా కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారంగా ఇంటర్వ్యూ సేవలు అందించే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. మానవ వనరుల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంలో సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసినట్లు ఇంటర్వ్యూ ఏఐ కో-ఫౌండర్, సీఈవో సిద్ధరామ్ శింగిషెట్టి తెలిపారు. ఈ సేవలతో ఇంటర్వ్యూ మరింత సులభతరం కానున్నదని, అలాగే సమయం ఆదా కానున్నదని ఆయన చెప్పారు.

విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

వేలేరు గురుకుల హాస్టల్‌లో రాత్రి నిద్ర చేసిన అడిషనల్ కలెక్టర్

వేలేరు, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం వేలేరు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల కళాశాలలో హాస్టల్ నిద్రలో భాగంగా రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో వంటగది, టాయిలెట్స్, తరగతి గదులు, విద్యార్థుల వసతి గదులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, డీటీ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సాధన సజ్జన సాంగత్యం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 10 : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో కాపువాడలోని వాయుపుత్ర మెడిటేషన్ సెంటర్‌లో ఈ నెల 12న సాధన సజ్జన సాంగత్యం ఏర్పాటు చేసినట్లు ప్రెసిడెంట్ ఆనంద్ దాలియా తెలిపారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జ్ఞానదాతగా 40 సంవత్సరాలకుపైగా భారతదేశంలోనే అన్ని ఆధ్యాత్మిక సంస్థలతో కలిసి పనిచేసిన హిమాలయ యోగి కట్ట కళాధర్ రెడ్డి వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో సెక్రటరీ రామ్మూర్తి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్, జాయింట్ సెక్రటరీలు పద్మ, రాజేశ్వరీ, సంధ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 : మండలంలోని కొప్పూరు గ్రామంలో వంగర ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఇటుకబట్టీ కార్మికులకు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి రుబీనా మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉంటే తక్షణమే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మెరుగైన వైద్యం తీసుకుంటే త్వరగా నయమవుతుందన్నారు. వైద్యాధికారి రహమాన్, వైద్యసిబ్బంది మోహన్, స్వరూప పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఇటుక బట్టీ కార్మికులతో వైద్యసిబ్బంది

మామిడి సాగుపై అవగాహన

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 10 : మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలోని మామిడితోటలో సోమవారం మామిడిసాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉద్యానవన అధికారి వెంకటేశం మాట్లాడుతూ.. మామిడితోట సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు రాకేశ్, సుష్మిత, ముల్కనూరు సహకార సంఘం ఏవోలు శ్రీనివాస్, అచ్యుతరెడ్డి, స్వామిరావు, ఆయిల్‌పామ్ కేఎన్ బయో కంపెనీ డీఎం రంజిత్, ఫీల్డ్ ఆఫీసర్లు రవివర్మ, అరుణ్, ఏఈవోలు నాగరాజు, అర్జున్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ముగియనున్న పీఏసీఎస్‌ల పాలకవర్గం గడువు

- ఫిబ్రవరి 15వ తేదీతో పదవీ కాలం పూర్తి
- గడువు పెంచే యోచనలో రాష్ట్ర సర్కారు?
- కొత్త సంఘాలకు ప్రతిపాదనలు

హనుమకొండ, ఫిబ్రవరి 10 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గం గడువు త్వరలో ముగియనుంది. గడువు ముగిసే ఆరు నెలల ముందు నుంచే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికే గ్రామపంచాయతీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పాలకవర్గం సైతం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల కాలపరిమితి ఈ నెల 15వ తేదీతో ముగియనున్నది. దీంతో ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు నిర్వహిస్తారా? లేక ప్రత్యేకాధికారిని నియమిస్తారా అనే చర్చ జరుగుతున్నది. ఎన్నికలపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని సహకార శాఖ అధికారులు అంటున్నారు.

గడువు పొడిగించే ఆలోచనలో సర్కారు?

సహకార సంఘాల పాలకవర్గం గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేసి గడువును మరో ఆరు నెలలు పొడిగించే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక వేళ ఎన్నికలు వాయిదా వేస్తే గ్రామ పంచాయతీలు, జడ్పీల మాదిరిగా పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా సంఘం బాధ్యులను నియమిస్తారా? లేకపోతే అధికారులను నియమిస్తారా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

సంఘాల పెంపునకు ప్రతిపాదనలు..

సర్కారు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. ప్రతి మండలానికి ఒక పీఏసీఎస్‌తో పాటు రైతులకు దూరభారం, ఇబ్బందులు కలుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సహకార శాఖ అధికారులను సర్కారు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో జిల్లాలో పాత వాటికి తోడుగా కొత్తగా మరికొన్ని సంఘాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ పీఏసీఎస్‌లో కొనసాగుతున్న వేలేరును విడదీసి సపరేట్ పీఏసీఎస్‌గా, కమలాపూర్ పీఏసీఎస్ నుంచి మర్రిపల్లిగూడెం, శనిగరంను వేరు చేసి పీఏసీఎస్‌లుగా, ఎల్కతుర్తి పీఏసీఎస్‌లో కొనసాగుతున్న భీమదేవరపల్లి, తిమ్మాపూర్‌ను ప్రత్యేక పీఏసీఎస్‌లుగా, పెద్దాపూర్ పీఏసీఎస్ నుంచి దామెర, ఊరుగొండను వేరుచేసి పీఏసీఎస్‌లుగా ఏర్పాటు చేసేందుకు కొత్తగా ప్రతిపాదించారు. వీటిని ప్రభుత్వం ఆమోదిస్తే పీఏసీఎస్‌ల సంఖ్య పెరగనుంది. దీంతో మరికొంత మందికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అవకాశం దక్కుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతానికి జిల్లాలో 16 పీఏసీఎస్‌లు ఉండగా ఒక్కొక్క సంఘంలో 13 మంది సభ్యులు ఉన్నారు. కొత్తగా ఏడింటిని ప్రతిపాదించారు. వీటికి ఆమోదం లభిస్తే జిల్లాలో పీఏసీఎస్‌ల సంఖ్య 23కు చేరుకోనుంది.

ఎంపీడీవోగా విమల బాధ్యతల స్వీకరణ

దామెర, ఫిబ్రవరి 10 : ఎంపీడీవోగా గజ్జెల విమల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన గుమ్మడి కల్పన సెలవుపై వెళ్లడంతో వేలేరు ఎంపీవోగా పనిచేస్తున్న విమలను దామెర ఎంపీడీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన విమలకు పంచాయతీ కార్యదర్శులు, కార్యలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంజపల్లి నరేశ్, ఫోరం రాష్ట్ర ఈసీ మెంబర్ అర్షం శ్రీనివాస్, శివశంకర్, మనోహర్‌రెడ్డి, వేణుమాధవ్, సందీప్, సిరివెన్నెల, రజిత, కవిత, పద్మ, సుకన్య, రామ్మూర్తి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరేందుకు ఆత్మవిశ్వాసం అవసరం

మడికొండ, ఫిబ్రవరి 10 : విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఆత్మవిశ్వాసం, కష్టపడే స్వభావాన్ని పెంచుకోవడం ఎంతో అవసరమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యు డు, మోటివేషన్ స్పీకర్ దామోదర్ అన్నారు. మడికొండలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులం కళాశాలలో విద్యా ర్థినులకు సంస్కార వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేదిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, వెంకటేశ్వర్లు, తేరాల యుగంధర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఫిబ్రవరి 10 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, పోలీస్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

డ్రైవర్‌కు అస్వస్థత.. అదుపు తప్పిన బస్సు

- ప్రయాణికులు, స్థానికుల అరుపులతో అప్రమత్తం
- డ్రైవర్ మద్యం తాగాడని ప్రయాణికుల వాగ్వాదం
- పరీక్షించి తాగలేదని తేల్చిన పోలీసులు

కాజీపేట, ఫిబ్రవరి 10 : విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్ అస్వస్థతకు గురికావడంతో బస్సు అదుపు తప్పి డివైడర్ ఎక్కిన ఘటన కాజీపేటలో సోమవారం రాత్రి జరిగింది. ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రయాణికులతో బయలుదేరింది. బాపూజీనగర్‌లో డ్రైవర్ అస్వస్థతకు గురై కళ్లు తిరగడంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఎక్కి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టబోయింది. దీంతో ప్రయాణికులు అరవడంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఒక్కసారిగా పక్కకు జరిపి రోడ్డుపై నిలిపివేశాడు. దీంతో కొందరు ప్రయాణికులు డ్రైవర్ మద్యం సేవించి బస్సును నడిపారని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. తోటి ప్రయాణికులు నచ్చచెప్పారు. అంతలోనే 100కు డయల్ చేయడంతో స్థానిక సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని తెలుసుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్ష చేసి, మద్యం తాగలేదని నిర్ధారించారు. వెంటనే డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించా రు. డ్రైవర్ అప్రమత్తతతోనే ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. ఈ ఘటనతో ట్రాఫిక్ స్తంభించగా, పోలీసులు క్లియర్ చేయించారు.



రోడ్డుపై నిలిపిన బస్సు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నయింనగర్, ఫిబ్రవరి 10 : భీమారంలోని జడ్పీఎస్ఎస్‌లో 2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే స్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందరు. హెచ్‌ఎం సుబాచాల, కమల, జ్యోతి, సుధాకర్, సదానందం, రాజేశ్వర్, జైపాల్‌రెడ్డి, మహేందర్, మీసాల విజయ పాల్గొన్నారు.

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటే పోటీల్లో పరకాల విద్యార్థుల ప్రతిభ

పరకాల, ఫిబ్రవరి 10 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పరకాల పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు క్రియేటివ్ కరాటే డూ క్లబ్ వ్యవస్థాపకుడు మాడ సంతప్‌కుమార్ పేర్కొన్నారు. సీనియర్స్ స్పారింగ్ విభాగంలో బండి సాయిచరణ్, బాలికల విభాగంలో పిల్ల అన్విక బంగారు పతకాలు సాధించారు. వీరితో పాటు పలు విభాగాల్లో లక్కం మణితేజ్, ఆరె హర్షిత, తపస్వీ, దీపక్, సాయితేజ, శ్రీవేదన్ పతకాలు సాధించినట్లు తెలిపారు.

'గ్యాబ్రియల్'లో ఆగిన హెలికాప్టర్

సెల్ఫీలు దిగేందుకు పోటాపోటీ

కాజీపేట, ఫిబ్రవరి 10 : కేంద్ర బృందం నక్ష పథకంలో భాగంగా జిల్లాలో ఆది, సోమవారం చిన్న పట్టణాలను డిజిటల్ ఏరియల్ సర్వే చేశారు. సోమవారం సాయంత్రం కాజీపేట పట్టణం దర్గా రోడ్డులోని సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ మైదానంలో హెలికాప్టర్ ల్యాండ్ అయింది. దీంతో పట్టణ ప్రజలు, ఆయా పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హెలికాప్టర్ వద్ద సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. వారిని ఆపేందుకు ఆర్వీ సంస్థ ప్రతినిధులు, పోలీసులు నానా కష్టాలు పడ్డారు.

ఈసారి మీరు గెలువకపోతే వచ్చేసారి అధికారం రాదు!

ఇదే అవకాశం.. త్వరపడండి

పదేళ్ల నుంచి ఉన్నోళ్లకే స్థానిక ఎన్నికల్లో టికెట్లు ఇస్తాం : ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, సంగెం మీటింగ్‌కు దూరంగా ఓ వర్గం

గీసుగొండ, ఫిబ్రవరి 10 : ఈసారి స్థానిక సంస్థల మీరు గెలువకపోతే వచ్చేసారి కాంగ్రెస్ అధికారంలోకి రాదని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వాళ్లకు ఇదే అవకాశమని కష్టపడి పని చేయాలని ఇప్పుడు కాకపోతే మళ్లీ మీకు అవకాశం రాదని చెప్పారు. స్థానిక ఎన్నికలపై గ్రేటర్ వరంగల్ 15, 16, 17వ డివిజన్ల నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు సోమవారం గీసుగొండ మండలం మరియపురంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మీటింగ్‌కు ఓ వర్గం దూరంగా ఉండడం చర్చనీయాంశమైంది. గీసుగొండ, సంగెం మండలాలతో పాటు డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో ముఖ్యనాయకులు, కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా వీరికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో కొంతకాలంగా వారంతా ఓ గ్రూపుగా ఏర్పడి ఎమ్మెల్యే పాల్గొనే సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. ఈ గ్రూపు వారంతా స్థానిక ఎన్నికల్లో స్వతంత్రులుగా పోటీ చేస్తారనే చర్చ మొదలైంది.

పదేళ్ల నుంచి ఉన్నోళ్లకే టికెట్లు : ఎమ్మెల్యే రేవూరి

పదేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వాళ్లకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుగా టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వాళ్లకు చివరి అవకాశాలు ఉంటాయన్నారు. గ్రూపులు వీడి పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు గల్లీ మంత్రుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశానికి వచ్చిన కార్యకర్తలకు సరిపోడా భోజనం అందక కొందరు తినకుండానే వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా సమావేశానికి ఓ వర్గం నాయకులు హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది.